# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 303 సోమవారం 24 జూన్ 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




# బీజేపీలో క్యాడర్ ఢర్

## అధ్యక్ష రేసుపై ఆసక్తికర చర్చ

## పార్టీ కీలక నేతలను కలిసేందుకు ఫియర్!

## తెలంగాణ బీజేపీలో కొత్త, పాత లీడర్ల మధ్య కోల్డ్ వార్..

హైదరాబాద్

తెలంగాణలో బీజేపీ 8 లోక్ సభ స్థానాల్లో గెలిచిన జోష్‌లో ఉంది. రాష్ట్రంలో ఓట్ల శాతం గణనీయంగా పెంచుకున్న కమలనాథులకు కొత్త చిక్కు వచ్చి పడింది. తెలంగాణలో బీజేపీ ఫేస్‌గా చెప్పుకునే నేతలంతా ఎంపీలుగా గెలిచారు. ఇద్దరు కేంద్ర మంత్రి వర్గంలో స్థానం సంపాదించుకున్నారు. వీరికి తోడుగా బీజేపీ నుంచి 8 మంది ఎమ్మెల్యేలు, ఓ ఎమ్మెల్సీ ఉండనే ఉన్నారు. వీళ్లే కాకుండా అదనంగా రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ జాతీయ నేతగా ఉన్నప్పటికీ తెలంగాణ బీజేపీలో కీలకంగా ఉన్నారు. ప్రజా ప్రతినిధుల సంఖ్య భారీగా పెంచుకున్న తెలంగాణ బీజేపీకి అసలు సమస్యే ఇక్కడే మొదలైంది. పార్టీ నుంచి ప్రజా ప్రతినిధులు పెరగడంతో ఆటోమెటిక్‌గా పార్టీలో పవర్ సెంటర్స్ ఎక్కువయ్యాయి. బీజేపీ రాష్ట్ర సారథిగా సికింద్రాబాద్ ఎంపీ కిషన్ రెడ్డి.. కేంద్ర మంత్రి వర్గంలో మరోసారి చోటుదక్కించుకున్నారు. కరీంనగర్ నుంచి ఎంపీగా గెలిచిన బండి సంజయ్ కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. గెలిచిన ఎంపీల్లో ఈటల రాజేందర్, డీకే అరుణ, ధర్మపురి అరవింద్, రఘునందన్ వీళ్లంతా ఎవరికి వారు పార్టీలో పవర్ సెంటర్స్‌గానే చెప్పుకోవచ్చు. గెలిచిన ఎంపీలను సన్మానించడానికి వెళ్లిన నేతలు.. ఫోటోలు తీసుకుని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడానికి భయపడుతున్నారు. కిషన్ రెడ్డి మనిషిగా.. బండి సంజయ్ మనిషిగా.. ఈటల రాజేందర్ మనిషిగా ముద్ర పడితే.. పొలిటికల్ కేరియర్ ఇబ్బందిగా మారే ప్రమాదం - మిగతా3లో

- కిషన్ రెడ్డి, బండి సంజయ్.. కేంద్ర మంత్రులుగా అవకాశం దక్కిన నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు ఎవరికి ఇస్తారనేది ఇప్పుడు హాట్ టాపిక్
- కిషన్ రెడ్డి స్థానంలో కొత్తవారిని నియమిస్తారనే ప్రచారం
- పార్టీ కీలక నేతలను కలిసేందుకు ఫియర్..!
- రాష్ట్రంలో ఓట్ల శాతం గణనీయంగా పెంచుకున్న కమలనాథులకు కొత్త చిక్కు
- ఫలానా వారి మనిషి అంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు రావేమోనని క్యాడర్‌లో భయం
- బీజేపీ రాష్ట్ర నేతల మధ్యవిభేదాలు నివురుగప్పిన నిప్పులా ఉన్న నేపథ్యంలో ఒక నేత దగ్గరకు వెళ్తే.. మరో నేత ఫీల్ అవుతారేమోనని బీజేపీ శ్రేణులకు గుబులు
- బీజేపీలో కొత్త, పాత నేతల మాటల ఆసక్తికర చర్చ

# పార్టీలో మార్పుచేర్పులు!

- నేడు ఢిల్లీకి వెళ్లనున్న సీఎం రేవంత్ రెడ్డి
- అటు పార్లమెంట్, ఇటు ఏఐసీసీ నేతలతో కీలక భేటీ
- నామినేటెడ్ పోస్టులు, మంత్రి వర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి ఎంపిక వంటి అంశాలపై అధిష్ఠానంతో చర్చించే అవకాశం
- పార్లమెంట్ ఎన్నికల్లో ఆశించిన మేరకు ఫలితాలు సాధించకపోవడంతో నామినేటెడ్ పోస్టుల భర్తీని పునస్సమీక్షించాలని అధిష్ఠానం నిర్ణయించినట్టు సమాచారం
- సీనియార్టీ ప్రాతిపదికన కాకుండా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పనితీరు ఆధారంగా పోస్టులను భర్తీ చేయాలని పార్టీ పెద్దల యోచన



హైదరాబాద్

సీఎం రేవంత్ రెడ్డి రేపు ఢిల్లీ వెళ్లనున్నారు. నామినేటెడ్ పోస్టులు, మంత్రి వర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి ఎంపిక వంటి అంశాలపై అధిష్ఠానంతో చర్చించే అవకాశం ఉంది. పార్లమెంట్ ఎన్నికల్లో ఆశించిన మేరకు ఫలితాలు సాధించకపోవడంతో నామినేటెడ్ పోస్టుల భర్తీని పునస్సమీక్షించాలని అధిష్ఠానం నిర్ణయించినట్టు సమాచారం. సీనియార్టీ ప్రాతిపదికన కాకుండా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పనితీరు ఆధారంగా పోస్టులను భర్తీ చేయాలని పార్టీ పెద్దలు యోచిస్తున్నట్టు తెలిసింది. అలాగే తమతో చర్చించకుండానే నామినేటెడ్ పోస్టులు ప్రకటించారని మంత్రులు, ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలు కొందరు సీఎం రేవంత్ రెడ్డిపై అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల ఆధారంగా వీటిలో మార్పుచేర్పులు ఉంటాయని అధిష్ఠానం అప్పుడు వారికి హామీ ఇచ్చింది. అలాగే మంత్రి పదవులను కూడా ఆశించే వారి సంఖ్య భారీగా ఉండటంతోఈ నేపథ్యంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. పార్లమెంట్‌లో ప్రస్తావించాల్సిన రాష్ట్రానికి చెందిన అంశాలపై ఎంపీలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం చేయనున్నారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసి పాలనపై పూర్తిస్థాయిలో దృష్టి సారించిన సీఎం - మిగతా3లో

# హడావిడి తప్ప ఆచరణ ఏదీ

- రుణామాఫీ చేసినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం హడావుడి చేస్తోందని బీఆర్ఎస్ విమర్శ
- రూ.31 వేల కోట్లలో ఒక్క రూపాయి రుణమాఫీ చేయకుండానే దానిని పెద్దా సాయంగా రేవంత్ ప్రభుత్వం బూతద్దంలో చూపుతుంది
- ఏడు నెలల తర్వాత చర్చ జరిగినందుకు సిగ్గుపడాలి .. దాని గురించి మీడియా వార్తలు రాయాలని బీఆర్ఎస్ సలహా

## హైదరాబాద్ -విజయవాడ హైవేపై


# 17 బ్లాక్ స్పాట్ల గుర్తించాం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- రూ. 325 కోట్లతో పనులు చేపడుతాం
- రానున్న నాలుగున్నర సంవత్సరాలలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో పేదలకు ఇండ్లతో పాటు, ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం
- ఆగస్టు 15లోగా 2 లక్షల రూపాయల రుణమాఫీని పూర్తి చేస్తాం
- వారం రోజుల్లో పేదలకు ఇంది రమ్మ ఇండ్లు నిర్మించే కార్యక్రమం చేపడతాం



నల్లగొండ

హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారిపై 17 బ్లాక్ స్పాట్లను గుర్తించాం. రూ. 325 కోట్లతో పనులు చేపడుతామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాలలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న నాలుగున్నర సంవత్సరాలలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో పేదలకు ఇండ్లతో పాటు, - మిగతా3లో



## నేటి నుంచే పార్లమెంటు తొలి సమావేశాలు

- ప్రమాణ స్వీకారం చేయనున్న ఎంపీలు
- మోదీ తరువాత మంత్రులు, సహాయ మంత్రులు, తరువాత మిగతా ఎంపీలు రాష్ట్రాల వారీగా అక్షర క్రమంలో ప్రమాణం
- ఎంపీల ప్రమాణం అనంతరం జూన్ 26న లోక్ సభ స్పీకర్ ఎన్నిక కార్యక్రమం
- జులై 3వ తేదీ వరకు పార్లమెంటు సమావేశాలు

## సీఎం అంటే కటింగ్ మాస్టరా..?

# కొత్త నిర్వచనమా..?

- రేవంత్‌ను ప్రశ్నించిన కేటీఆర్
- ప్రతి పథకంలో లబ్ధిదారుల సంఖ్యకు కోతపెట్టడమే లక్ష్యమా..?
- నాడు పరుగు పరుగున వెళ్లి రైతులను లోన్ తెచ్చుకోమన్నారు
- నేడు రూ.2లక్షల రుణమాఫీకి సవాలక్ష కొర్రీలు పెడుతున్నారు



హైదరాబాద్

సీఎం అంటే కటింగ్ మాస్టరా? అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల తారకరామారావు ప్రశ్నించారు. ప్రతి పథకంలో లబ్ధిదారుల సంఖ్యకు కోతపెట్టడమే లక్ష్యమా..? సీఎం అనే పదానికి ఇదే సరికొత్త నిర్వచనమా? అంటూ సోషల్ మీడియా వేదికగా నిలదీశారు. నాడు పరుగు పరుగున వెళ్లి రైతులను లోన్ తెచ్చుకోమన్నారని.. నేడు రూ.2లక్షల రుణమాఫీకి సవాలక్ష కొర్రీలు పెడుతున్నారని విమర్శించారు. రూ.39వేలకోట్లు.. ఇప్పుడు రూ.31వేలకోట్లకు కటింగ్ పెట్టి కుదించారన్నారు. పాసుబుక్కులు లేవనే నెపంతో లక్షల మందికి - మిగతా3లో

# కల్తీ మద్యం కుట్ర బీజేపీ పనే

**చెన్నై:** తమిళనాడులోని కల్లకురిచి జిల్లాలో 50 మందికిపైగా మరణించిన కల్తీ మద్యం విషాదానికి బీజేపీ కారణమని అధికార డీఎంకే పార్టీ విమర్శించింది. తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలై దీనికి కుట్ర పన్నారని డీఎంకే ఆర్గనైజేషనల్ సెక్రటరీ ఆర్ఎస్ భారతి ఆరోపించారు. కల్తీ మద్యం తయారీకి ఉపయోగించిన మిథనాల్‌ను బీజేపీ కూటమి పాలిత రాష్ట్రమైన పుదుచ్చేరి నుంచి సేకరించారని అన్నారు. డీఎంకే నేత ఆర్ఎస్ భారతి మీడియాతో మాట్లాడారు. కల్తీ మద్యం మరణాలకు బాధ్యత వహించి సీఎం స్టాలిన్ రాజీనామా చేయాలన్న అన్నామలై డిమాండ్‌పై ఆయన స్పందించారు. 'ఎవరైనా రాజీనామా చేయాల్సి వస్తే, అది బీజేపీ మంత్రులు, పుదుచ్చేరి సీఎం. ముడిసరుకు అక్కడి



నుంచి వచ్చిందని పోలీసులు చెబుతున్నారు. కల్తీ మద్యానికి బీజేపీనే బాధ్యత వహించాలి. వారే ఈ పని చేశారు. అన్నామలై చేసిన ప్రణాళికాబద్ధమైన కుట్ర ఇది. ఎన్నికలకు ముందు జరిగిందా అనే సందేహం ఉంది' అని అన్నారు. కాగా, గతంలో జరిగిన ఇలాంటి సంఘటనలకు బీజేపీ నేతలు, మంత్రులు బాధ్యత వహించారా? అని డీఎంకే నేత ఆర్ఎస్ భారతి నిలదీశారు. 'డార్జిలింగ్ రైలు ప్రమాదం తర్వాత రైల్వే మంత్రి రాజీనామా చేశారా? నీట్ కుట్రలకు కేంద్ర మంత్రి రాజీనామా చేశారా? 2009లో కల్తీ మద్యం తాగి 137 మంది చనిపోతే నరేంద్ర మోదీ రాజీనామా చేశారా?' అని ప్రశ్నించారు. కల్తీ మద్యం సంఘటనకు సంబంధించి అన్నామలై తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు.

## నేటి నుంచే పార్లమెంటు తొలి సమావేశాలు



**ఢిల్లీ:** కేంద్రంలో మూడోసారి ప్రధాని మోదీ నేతృత్వంలో ఎన్డీఏ సర్కార్ పగ్గాలు చేపట్టిన తరువాత తొలిసారి పార్లమెంటు సమావేశాలు రేపు(జూన్ 24) ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్నాయి. తొలిరోజే దాదాపు 280 మంది లోక్ సభ ఎంపీలు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. స్పెషల్ సెషన్ కావడంతో క్వశ్చన్ అవర్ లేదా జీరో అవర్ ఉండదు. ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్.. ఎంపీలతో ప్రమాణం చేయించనున్నారు. తొలుత ప్రధాని మోదీ ప్రమాణం చేశాక సీనియారిటీ ఆధారంగా మంత్రులు, ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది. మోదీ తరువాత మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్ లాల్, సహాయ మంత్రులు, తరువాత మిగతా ఎంపీలు రాష్ట్రాల వారీగా అక్షర క్రమంలో ప్రమాణం చేయనున్నారు. మొదట అండమాన్ నికోబార్ తర్వాత ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, అస్సోం, బిహార్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఎంపీలు ప్రమాణం చేస్తారు. మిగతా 264 మంది లోక్‌సభ ఎంపీలు రెండో రోజు ప్రమాణం చేస్తారు. ఒక్క ఎంపీ ప్రమాణ స్వీకారానికి దాదాపు నిమిషం పడుతుంది.

**తెలుగు రాష్ట్రాల ఎంపీలు..**

అక్షర క్రమంలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉండటంతో ఏపీ నుంచి గెలిచిన ఎంపీలు, తెలంగాణ ఎంపీలు తొలిరోజే ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎంపీల ప్రమాణం అనంతరం జూన్ 26న లోక్ సభ స్పీకర్ ఎన్నిక కార్యక్రమం ఉంటుంది. 27న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ప్రసంగిస్తారు. జులై 3వ తేదీ వరకు పార్లమెంటు సమావేశాలు జరగనున్నాయి.

## ఇది ఎయిర్ కండిషన్డ్ సత్యాగ్రహం : అతిషి దీక్షపై బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ




ఢిల్లీలో నీటి సంక్షోభానికి నిరసనగా ఢిల్లీ మంత్రి, ఆప్ నేత అతిషి చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షపై బీజేపీ ఢిల్లీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ విమర్శలు గుప్పించారు. మీడియా ఫొటోలకు ఫోజులిచ్చేందుకు రెండు గంటల పాటు ఆమె వేదిక వద్ద గడుపుతున్నారని, ఇదేం నిరాహార దీక్ష అని ఆయన ఎద్దేవా చేశారు. ఇది ఎయిర్ కండిషన్డ్ సత్యాగ్రహంలా ఉందని వ్యాఖ్యానించారు. ఈ రాజకీయ డ్రామాతో అతిషి ఢిల్లీ ప్రజలను మోసం చేయలేరని పేర్కొన్నారు. ఢిల్లీ మంత్రులు సత్యాగ్రహాలు, బెయిల్, జైలు, అవినీతి క్రీడల్లో మునిగితేలుతున్నారని వీరేంద్ర సచ్‌దేవ దుయ్యబట్టారు. ఇక దేశ రాజధానిలో ప్రజలు నీటి కష్టాలతో సతమతమవుతున్నారు.

## మనసు మార్చుకున్న మాయావతి.. వారసుడు ప్రకటన




దేశంలో సార్వత్రిక ఎన్నికల ముందు బీఎస్పీ అధినేత మాయావతి తన రాజకీయ వారసుడి బాధ్యతల నుంచి తన మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌ను తొలగించారు. అదేవిధంగా పార్టీలో అన్ని బాధ్యతల నుంచి తప్పించారు. ఎన్నికల తర్వాత మాయావతి తన మనసు మార్చుకుని మరోసారి తన రాజకీయ వారసుడిగా ఆకాష్ ఆనంద్ పేరును ప్రకటించారు. అలాగే బీఎస్పీ జాతీయ కోఆర్డినేటర్ బాధ్యతలను ఆయనకు అప్పగించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత బీఎస్పీ అధినేత మాయావతి పార్టీ కార్యాలయంలో జరిగిన తొలి సమావేశంలో పాల్గొన్నారు. సరిగ్గా 11 గంటలకు మాయావతి సమావేశానికి హాజరయ్యారు. ఆమె తన సోదరుడు, మేనల్లుడితో కలిసి సభావేదికపైకి వచ్చారు. మాయావతి ముందు వరుసలో ఉండగా.. ఆ తర్వాత ఆమె సోదరుడు ఆనంద్ కుమార్, ఆయన కుమారుడు ఆకాష్ ఆనంద్ ఉన్నారు. ఆ తర్వాత ఆకాష్ ఆనంద్ మాయావతి పాదాలను తాకి ఆశీర్వాదం తీసుకున్నారు. బీఎస్పీ అధినేత్రి తన మేనల్లుడి తలపై చేయి వేసి ఆశీర్వదించారు. దీంతో మరోసారి ఆకాష్ ఆనంద్ బీఎస్పీలో కీలకపాత్ర పోషించనున్నట్లు పార్టీ కార్యకర్తలకు అర్థమైంది.

**ఎన్నికలకు ముందు..**

మాయావతి సోదరుడు కుమారుడు ఆకాష్ ఆనంద్‌ను కొన్ని నెలల క్రితం తన రాజకీయ వారసుడిగా ప్రకటించారు. మాయావతి తర్వాత పార్టీలో కీలకమైన నాయకుడిగా ఆకాష్ ఆనంద్ ఉన్నారు. దేశ వ్యాప్తంగా తిరుగుతూ పార్టీ కోసం ప్రచారం చేశారు. అయితే అనూహ్యంగా ఆకాష్ ఆనంద్‌ను పార్టీ బాధ్యతల నుంచి తొలగించి సార్వత్రిక ఎన్నికల ముందు ఆయనను పక్కనపెట్టారు. దీంతో ఆకాష్ ఆనంద్ రాజకీయాలకు దూరంగా ఉంటూ ఇంటికే పరిమితమయ్యారు. కాగా ఎన్నికల్లో బీఎస్పీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. యూపీలో ఒక్క సీటును గెలుచుకోలేకపోయింది. మే7వ తేదీన ఆకాష్ ఆనంద్‌ను బీఎస్పీలో అన్ని బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు మాయావతి తెలిపారు. మళ్లీ జూన్ 23న మరోసారి తన వారసుడిగా ప్రకటించి పార్టీ జాతీయ కోఆర్డినేటర్ బాధ్యతలను అప్పగించారు.

## సుప్రీంకోర్టుకు అరవింద్ కేజ్రీవాల్.. హైకోర్టు ఆదేశాలను సవాల్ చేసిన సీఎం



ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మద్యం పాలసీ కేసులో కోర్టు ఆయనకు బెయిల్‌ను మంజూరు చేసిన విషయం తెలిసిందే. బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు మధ్యంత స్టే ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ సర్వోన్నత న్యాయస్థాన్నా ఆశ్రయించారు. కేజ్రీవాల్ తరఫున న్యాయవాదులు సోమవారం ఈ అంశంపై విచారణ కోరుతామని తెలిపారు. కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై మధ్యంతర స్టే విధిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్ కుమార్ జైన శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ట్రయల్ కోర్టు గురువారం అరవింద్ కేజ్రీవాల్‌కు రూ.లక్ష పూచీకత్తుపై బెయిల్‌ను మంజూరు చేసింది. రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఈ కేసులో ప్రత్యక్ష సాక్ష్యాలను చూపడంలో ఈడీ విఫలమైందని న్యాయమూర్తి పేర్కొన్నారు. దీంతో ఈడీ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. బెయిల్ ఆర్డర్‌పై స్టే విధించాలని కోరగా.. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు బెయిల్‌పై మధ్యంతర స్టే ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ క్రమంలో అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 2021-22 సంబంధించిన మద్యం పాలసీ కేసులో మార్చి 21న అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేసింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. ఆ తర్వాత జూన్ 2న తిరిగి కోర్టులో లొంగిపోయారు. వైద్యపరమైన కారణాలతో ఏడువారాల పాటు మధ్యంతర బెయిల్‌ను కోరగా.. జూన్ 5న ట్రయల్ కోర్టు తిరస్కరించింది. తాజాగా రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. కోర్టు అనుమతి ఇచ్చింది. ఈడీ హైకోర్టును ఆశ్రయించగా స్టే విధిస్తూ ఆదేశాలు ఇచ్చింది.

## ఆసుపత్రిలో చెకప్ సందర్భంగా.. తప్పించుకున్న గర్భిణీ ఖైదీ



భోపాల్: గర్భిణీ ఖైదీ పోలీసుల కళ్లగప్పింది. ఆసుపత్రిలో చెకప్ సందర్భంగా తప్పించుకుని పారిపోయింది. దీంతో ఆ మహిళా ఖైదీ కోసం పోలీసులు వెతుకుతున్నారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. విదిషా జిల్లాలోని కుర్వాయి ప్రాంతానికి చెందిన 24 ఏళ్ల సలేహా ఖురేషీ తన ప్రియుడ్ని హత్య చేసింది. దీంతో పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. అయితే విదిషా జిల్లా జైలులో ఉన్న సలేహా గర్భవతిగా నిర్ధారణ అయ్యింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 27న ఆమెను విదిషా జిల్లా జైలు నుంచి భోపాల్ సెంట్రల్ జైలుకు తరలించారు. కాగా, విచారణ ఖైదీగా ఉన్న గర్భవతి అయిన సలేహాను వైద్య పరీక్షల కోసం శనివారం హమీదియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే జైలు గార్డుల కళ్లగప్పిన ఆమె అక్కడి నుంచి తప్పించుకుంది. ఈ విషయం తెలుసుకున్న జైలు అధికారులు షాక్ అయ్యారు. కోహెఫిజా పోలీసులు, సెంట్రల్ జైలు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో తప్పించుకుని పారిపోయిన గర్భిణీ ఖైదీ సలేహా కోసం పోలీసులు వెతుకుతున్నారు.

## నీట్ పేపర్ లీకేజీపై సీబీఐ దూకుడు..
# తొలి ఎఫ్ఐఆర్ నమోదు




దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ పేపర్ లీకేజీ కేసులో సీబీఐ దూకుడు పెంచింది. కేంద్రప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు లక్ష్యంగా చేసుకోవడంతో ఈకేసుపై సీబీఐ దర్యాప్తునకు కేంద్రం ఆదేశించింది. మరోవైపు యూజీసీ నెట్, నీట్ పరీక్షల పేపర్ లీకేజీలకు ప్రధాని మోదీ బాధ్యత వహించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. మోదీ ప్రభుత్వం మొత్తం విద్యావ్యవస్థను మాఫియాకు, అవినీతిపరులకు అప్పగించిందని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ ఆరోపించారు. ఈక్రమంలో కేసు దర్యాప్తును వేగవంతం చేసేందుకు కేంద్రం చర్యలు తీసుకుంది. దీంతో నీట్ పేపర్ లీకేజీపై సీబీఐ మొదటి ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసింది. దర్యాప్తు బాధ్యతలు స్వీకరించిన రెండో రోజు సీబీఐ నీట్ పేపర్ లీకేజీ కేసుపై తొలి ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. రానున్న రోజుల్లో ఈ పేపర్ లీకేజీ ఘటనలో మరింతమంది వ్యక్తులను అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**ఉన్నతస్థాయి సమీక్ష తర్వాత..**

నీట్ పేపర్ లీకేజీ ఘటన దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపడంతో విద్యాశాఖ మంత్రిత్వశాఖ ఉన్నతస్థాయి సమీక్షను నిర్వహించింది. నీట్ పరీక్ష ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం కోల్పోకుండా ఉండేందుకు పేపర్ లీకేజీ ఘటనపై సీబీఐకి అప్పగించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా కేంద్రవిద్యాశాఖ అధికారులు తెలిపారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో ఏదైనా వ్యక్తి, సంస్థ ప్రమేయం ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే కేంద్రప్రభుత్వం హెచ్చరించిన విషయం తెలిసిందే.

**ఎన్టీఏ చీఫ్ తొలగింపు**

దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటన సంచలన రేపడంతో కేంద్రప్రభుత్వం ఎన్టీఏ ప్రస్తుత డైరెక్టర్ జనరల్ సుబోధ్ సింగ్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించింది. ఆయన స్థానంలో సీనియర్ అధికారి ప్రదీప్ సింగ్ ఖరోలాను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ డీజీగా నియమించింది.

## 56కి చేరిన కల్తీసారా మృతుల సంఖ్య.. బాధితులను పరామర్శించిన కమల్



**తమిళనాడు:** తమిళనాట తీవ్ర విషాదాన్ని నింపిన కల్తీ సారా బాధితులకు మక్కల్ నీది మయ్యమ్ అధినేత, హీరో కమల్ హాసన్ భరోసా ఇచ్చారు. కళ్లకురిచ్చి మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్న బాధితులను ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాల్లో ధైర్యం నింపారు. చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. హూచ్ దుర్ఘటనలో మృతుల సంఖ్య 56కి చేరిందని జిల్లా యంత్రాంగం ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. కలెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని నాలుగు వేర్వేరు ఆసుపత్రుల్లో 216 మంది బాధితులు చికిత్స పొందుతున్నారు.

**నిందితుడి అరెస్ట్..**

తమిళనాడు కల్లకురిచ్చి జిల్లాలోని కల్తీ సారా సరఫరా కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లాలోని కరుణాపురం గ్రామానికి చిన్నదురై అనే వ్యక్తి కల్తీ లిక్కర్ సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఘటన జరిగినప్పటి నుంచి ప్రతి రోజూ గ్రామంలో మరణాలు సంభవిస్తున్నాయని, మరికొంత మంది పలు హాస్పిటళ్లలో చికిత్స తీసుకుంటున్నారని వైద్యులు తెలిపారు. రిటైర్డ్ జస్టిస్ గోకుల్‌దాస్ కమిషన్ ఘటనపై దర్యాప్తు ప్రారంభించింది. మరో మూడు నెలల్లో సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక అందించనున్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పలువురు పోలీసు అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సస్పెండ్ చేయగా, కలెక్టర్‌ను బదిలీ చేసింది. రాష్ట్రంలో అక్రమ మద్యంపై ఉక్కు పాదం మోపుతానని సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు. కాగా, ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ స్టాలిన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

## కల్తీ మద్యంతో దళితులు మరణిస్తుంటే నోరు మెదపని రాహుల్ గాంధీ : నిర్మలా సీతారామన్

తమిళనాడు కల్తీ సారా ఘటనలో 50 మందికిపైగా మరణించిన ఘటనపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. కళ్లకురుచిలో జరిగిన ఈ ఘటనలో 200 మందికి పైగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, వీరి పరిస్థితి విషమంగా ఉందని అన్నారు. ఈ ఘటనలో ఇప్పటికే 56 మంది మరణించారని, వీరిలో అధికులు షెడ్యూల్డ్ కులాల వారే అని పేర్కొన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నానని ఆమె తెలిపారు. కల్తీ సారా ఘటనపై కాంగ్రెస్ ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం తనను విస్మయానికి గురిచేసిందని నిర్మలా సీతారామన్ అన్నారు. ప్రభుత్వం నిర్వహించే షాపుల్లో కళ్లకురుచిలో బాహాటంగా కల్తీ మద్యం, నాటు సారా విక్రయిస్తుంటే డీఎంకే సర్కార్‌కు మద్దతిస్తున్న కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే, ఆ పార్టీ ఎంపీ, అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్కడున్నారని ఆమె నిలదీశారు. కల్తీ మద్యంతో దళితులు మరణిస్తుంటే రాహుల్ గాంధీ నోరు మెదపడం లేదని మండిపడ్డారు.

## మా చివరి ఆశ మీరే.. నీట్ పేపర్ లీకేజీ నిరసనల్లో విద్యార్థుల భారీ నిరసన

**ఢిల్లీ:** నీట్ యూజీ పేపర్ లీక్ వివాదం తీవ్రరూపం దాల్చడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆదివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మెడికల్ ప్రవేశ పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. నిరసనకారులు జంతర్ మంతర్ నుండి లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వరకు ర్యాలీ తీశారు. అయితే వారిని పోలీసులు అడ్డుకున్నారు. ప్రధానిని కలవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. పోలీసులు అనుమతి నిరాకరించి, ప్రధానికి లేఖ రాయాలని నిరసనకారులకు సూచించారు. అనంతరం ఆందోళనకారులు పోలీసులకు సదరు లేఖను అందజేసి నిరసనను విరమించారు. బిహార్ పోలీసులు పేపర్ లీకేజ్‌ని బయట పెట్టారని, అందువల్ల కౌన్సెలింగ్‌ను తక్షణమే నిలిపివేయాలని విద్యార్థులు లేఖలో నొక్కి చెప్పారు. 'దయచేసి న్యాయం చేయండి, మా చివరి ఆశ మీరే' అని విద్యార్థులు ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. మే 5 న నీట్ యూజీ ప్రవేశ పరీక్ష జరిగింది, ఇందులో దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు పాల్గొన్నారు. 60మందికిపైగా విద్యార్థులకు ఫస్ట్ ర్యాంక్ రావడంతో పేపర్ లీకేజీ ఆరోపణలు వచ్చాయి. జూన్ 4న ఫలితాలు ప్రకటించగా, బీహార్ తదితర రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాల లీకేజీ జరిగినట్లు కాంగ్రెస్ సహా విపక్షాలు ఆరోపణలు గుప్పించాయి. నీట్ ప్రవేశ పరీక్ష లీకేజీ నిజమేనని నిర్ధారణ కావడంతో కౌన్సెలింగ్‌ను నిలిపివేసి మళ్లీ పరీక్షలను నిర్వహించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

**కమిటీ ఏర్పాటు..**

రెండు వారాలకు పైగా దేశవ్యాప్తంగా విద్యార్థులు జరుపుతున్న పోరాటం, జాతీయ స్థాయిలో బలపడిన విపక్షం ఒత్తిడి ఫలించాయి. జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన నీట్-యూజీ, యూజీసీ-నెట్ ప్రవేశ పరీక్షల లీక్ వ్యవహారాలపై విమర్శలు వెల్లువెత్తి, ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బ తినడం, సోమవారం నుంచి జరగనున్న పార్లమెంటు సమావేశాల్లో అదే ప్రధాన అంశం అయ్యే పరిస్థితి కనిపించడంతో కేంద్ర ప్రభుత్వం నష్ట నివారణ చర్యలను ప్రారంభించింది. శనివారం మధ్యాహ్నం నుంచి చకచకా పలు నిర్ణయాలు తీసుకుంది. మొదట నీట్ పరీక్షను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ప్రక్షాళనకు ఉన్నత స్థాయి కమిటీని వేసింది. తర్వాత ఎన్‌టీఏ అధిపతిని పదవి నుంచి తప్పించింది. అసలు ఎన్‌టీఏకు లోపాల్లేకుండా పరీక్షలు నిర్వహించే సామర్థ్యం ఉందో లేదో తేల్చుకొనే వరకు పరీక్షల నిర్వహణకు విరామం ప్రకటించే కార్యక్రమంలో భాగంగా ఆదివారం జరగాల్సిన నీట్-పీజీ పరీక్షను వాయిదా వేసింది. చివరగా శనివారం రాత్రి నీట్ లీక్ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

# బీజేపీలో క్యా'ఢర్'

-మొదటిపేజీ తరువాయి

ఉందని జంకుతున్నారు. ఫలానా వారి మనిషి అంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు రావేమోనని భయం క్యాడర్ లో పట్టుకుంది. బీజేపీ రాష్ట్ర నేతల మధ్యవిభేదాలు నివురుగప్పిన నిప్పులా ఉన్న నేపథ్యంలో ఒక నేత దగ్గరకు వెళ్తే.. మరో నేత ఫీల్ అవుతారేమోనని బీజేపీ శ్రేణులకు గుబులు పట్టుకుంది. మొత్తంగా బీజేపీ క్యాడర్.. గెలిచిన ఎంపీలను, మంత్రులను చాటుమాటుగా కలిసి తమ భక్తిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు.

**బీజేపీలో కొత్త, పాత నేతల మాటల ఆసక్తికర చర్చ**

తెలంగాణ బీజేపీలో కొత్త, పాత నేతల మాటల ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. రాష్ట్ర కాషాయ పార్టీ సారథిగా ప్రస్తుతం కిషన్ రెడ్డి కొనసాగుతున్నారు. కేంద్ర మంత్రివర్గంలో మరోమారు ఛాన్స్ దక్కించుకున్న నేపథ్యంలో కిషన్ రెడ్డి స్థానంలో కొత్తవారిని నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పాత వారికే పార్టీ పగ్గాలు అప్పగించాలని ఓ వర్గం డిమాండ్ చేస్తుంటే.. మరోవర్గం నేతలు సామర్థ్యాన్ని, స్థాయిని బట్టి పార్టీ అధిష్టానం పదవులు ఇస్తుందని అంటున్నారు. పార్టీ కొత్త, పాత అంటూ రెండూగా బీజేపీ చీలిపోయినట్లు కనిపిస్తోంది. తెలంగాణ బీజేపీలో కీలక నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్.. కేంద్ర మంత్రులుగా అవకాశం దక్కిన నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు ఎవరికి ఇస్తారనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్ కు పార్టీ పగ్గాలు అప్పగించబోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. మరోవైపు మెదక్ ఎంపీ రఘునందన్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, పాలమూరు ఎంపీ డీ కే అరుణ ఎవరికి వారు పార్టీ చీఫ్ పోస్ట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకటరమణ రెడ్డి సైతం స్టేట్ ప్రెసిడెంట్ రేసులో ఉన్నామని చెబుతున్నారు. ఇంకోవైపు సంఘ్ పరివార క్షేత్రాల్లో పనిచేసిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు, చింతల రామచంద్రారెడ్డి, కాసం వెంకటేశ్వర్లు లాంటి నేతలు రాష్ట్ర పార్టీ బాధ్యతల కోసం గట్టి లాబీయింగ్ చేస్తున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడి నియామాకం తర్వాతే రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిని నియమించే అవకాశముంది.

ఈ నేపథ్యంలో తెలంగాణ బీజేపీ నేతల మధ్య పాత, కొత్త నేతల మధ్య కోల్డ్ వార్ కొనసాగుతోంది. రాజకీయ పార్టీకి సంపూర్ణ విజయం దక్కాలంటే కొత్త నాయకత్వం, కొత్త కార్యకర్తలు అవసరమంటున్నారు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్. పార్టీలో పాత, కొత్త నాయకులలో ఎవరు ఎక్కువ కాదు.. ఎవరు తక్కువ కాదన్న కామెంట్స్ ఇప్పుడు కాషాయదళంలో కాకరేపుతున్నాయి. ఎప్పుడు వచ్చామన్నది కాదు.. బుల్లెట్ దిగిందా ? లేదా ? అన్నదే పాయింట్ అన్నట్లుగా ఈటల బీజేపీ చీఫ్ పోస్ట్ కోసం గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈటల రాజేందర్ మాట్లాడిన కొద్దిగంటల్లోనే గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్.. దేశం, ధర్మం, పార్టీ పై భక్తి ఉన్న నేతకే రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగించాలని సంచలన కామెంట్ చేశారు. 8 మంది ఎంపీలు 8 మంది ఎమ్మెల్యేలు సహా అందరి ఒపీనియన్ తీసుకున్నాకే రాష్ట్ర అధ్యక్షుడు ఎంపిక చేయాలని అధిష్టానానికి ఎమ్మెల్యే రాజాసింగ్ సూచన చేశారు.

వీరిద్దరూ ఇలా మాట్లాడగా.. మెదక్ ఎంపీ రఘునందన్ మరోరకంగా రియాక్ట్ అయ్యారు. కొత్తగా వచ్చిన నేతలకు పదవులు రావనేది ఏమీ లేదని.. అసోం సీఎం హిమంతబిశ్వశర్మకు సీఎం పదవి దక్కిన విషయాన్ని గుర్తు చేశారు రఘునందన్ రావు. తెలంగాణ బీజేపీలో పాత, కొత్త నేతల మధ్య రాజుకున్న వివాదం ఎక్కడికి దారితీస్తుందోనని పార్టీలో చర్చ మొదలైంది. ఈ నెల చివరి నాటికి పార్టీ కొత్త సారథిపై క్లారిటీ వచ్చే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తంగా తెలంగాణ బీజేపీలో పాత, కొత్త వివాదాన్ని పార్టీ అధిష్టానం ఎలా పరిష్కరిస్తుందో చూడాలి మరి..

# హడావిడి తప్ప ఆచరణ ఏదీ

**హైదరాబాద్ :** కేబినెట్‌లో చర్చించి రుణామాఫీ చేసినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం హడావుడి చేస్తోందని బీఆర్ఎస్ విమర్శించింది. రూ.31 వేల కోట్లలో ఒక్క రూపాయి రుణమాఫీ చేయకుండానే దానిని పెద్దా సాయంగా రేవంత్ ప్రభుత్వం బూతద్దంలో చూపుతుందని ఆ పార్టీ నేతలు మండిపడ్డారు. క్యాబినెట్ చర్చ కాగానే రుణమాఫీ చేసినట్లు ఒక సెక్షన్ మీడియా చిత్రీకరిస్తున్నదని.. పిల్ల పుట్టక ముందే మీడియా కుల్లకుడుతుందని విమర్శించారు. ఏడు నెలల తర్వాత చర్చ జరిగినందుకు సిగ్గుపడాలి .. దాని గురించి మీడియా వార్తలు రాయాలని బీఆర్ఎస్ సలహా ఇచ్చారు. ఆలు లేదు చూలు లేదు .. కొడుకు పేరు సోమలింగం అన్నట్లు మీడియా తీరు ఉంది. బీఆర్ఎస్ పాలనలో ఒక్క రోజు ఆలస్యమైతే మీడియా, మేధావులు ఒంటి కాలి మీద లేచేవారన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిరంజన్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు మీడియాతో మాట్లాడారు. రైతాంగం ఉసురుపోసుకుంటున్నా ఇప్పుడు మేధావులు నోరెత్తడం లేదు .. మీడియా ప్రభుత్వానికి మద్దతు పలుకుతుందన్నారు. డిసెంబరు 9 రుణమాఫీ అని చెప్పి .. హోల్ సేల్ గా 70 లక్షల మంది రైతులను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ వట్టి బోగస్ .. 5 ఎకరాల వరకు ఉన్న రైతులకు రుణమాఫీ అంటున్నారు.. 5 ఎకరాలు ఉన్న వారికి రూ.2 లక్షల రుణం ఏ బ్యాంకు ఇవ్వదన్న విషయం తెలియదా అని ప్రశ్నించార. అసలు ఏ క్యాటగిరీ, ఏ ప్రాతిపదికన రుణమాఫీ చేస్తుందో ప్రభుత్వం వివరాలు విడుదల చేయాలని డిమాండ్ లచేశారు. హామీల అమలులో కాంగ్రెస్ విఫలం అయిందని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండు సీజన్లు అయిపోయిందన్నారు.



ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ ను స్థాయికి మించి దుర్భాషలాడారని.. రైతుబంధు రెండు పంటలకు కాదు మూడు పంటలకు ఇస్తానన్నాడని రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎకరాకు రూ.15 వేలు కాదు, పాత రూ.10 వేలు రైతుబంధు కు కూడా గతిలేదన్నారు. ఏరొక్క పౌర్ణమి నాటికి నదులు పారాలి కానీ.. పుణ్యాత్ములు అడుగుపెట్టిన కాలమహిమో ఏమో ఇంత వరకు నీళ్లు రాలేదన్నారు. రైతుభరోసా మార్గదర్శకాల కోసం జులై 15 వరకు గడువు పెట్టుకున్నారు .. అప్పటికి వానాకాలం సగం అయిపోతుందన్నారు. పట్టాదారు పాస్ బుక్ ఉన్న ప్రతి రైతుకూ రైతుబంధు ఇచ్చామని.. కొండలు, గుట్టలకు రైతుబంధు ఇచ్చారని ఆరోపించారు. మరి ఇటీవల ఇచ్చాం అని చెప్పుకుంటున్న రైతుబంధు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. 68.99 లక్షల మంది రైతులకు బీఅర్ఎస్ పార్టీ 11 విడతల్లో రూ.72,815 కోట్లు ఒక్క రైతుబంధు కింద రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఒక కోటి 52 లక్షల ఎకరాలకు రైతుబంధు వర్తింపచేశామని.. లోపాలను గత ఏడు నెలలలో కాంగ్రెస్ ఎందుకు సరిచేయలేదని ప్రశ్నించారు. ప్రతి 5 వేల ఎకరాలకు ఒకటి చొప్పున రాష్ట్రంలో 2603 క్లస్టర్లు ఉన్నాయని.. తెలంగాణ ప్రభుత్వ డాటా ఆధారంగానే కేంద్రం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన అమలు చేసిందని గుర్తు చేశారు. కొన్ని క్లస్టర్లను ఎంపిక చేసుకుని కలెక్టర్లతో రాండమ్ గా సర్వే చేస్తే ఒక్క రోజులో పూర్తవుతుందన్నారు. ఆధునిక యుగంలో అన్ని అవకాశాలు ఉన్నా రైతులకు రైతుబంధు ఎగ్గొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుటిల యత్నాలు చేస్తుందని విమర్శించారు. రైతుభీమా, ఉచిత కరంటు, పంటల కొనుగోళ్లు, విత్తనాలు, ఎరువుల సబ్సిడి, మైనర్ ఇరిగేషన్, కొత్త ప్రాజెక్టుల నిర్మాణంతో రైతాంగానికి అండగా నిలిచామని.. తెలంగాణలో వ్యవసాయ రంగం అభివృద్దితో తెలంగాణ తలసరి ఆదాయం పెరిగి దేశానికి తోడ్పాటు అందించిందన్నారు. తెలంగాణలో 92.5 శాతం భూమి 5 ఎకరాల లోపు రైతుల వద్దనే ఉంది .. 5 నుండి 6 శాతం రైతుల వద్ద పది ఎకరాల వరకు భూమి ఉందన్నారు. రుణమాఫీ, రైతుభరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతుల తరపున రైతులతో కలిసి పోరాడతామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హెచ్చరించారు

# సింగరేణిని ప్రైవేట్ పరం చేస్తే పేదలు, దళితులు హక్కులు కోల్పోతారు

**హైదరాబాద్ :** తెలంగాణకే తలమానికంగా నిలిచిన సింగరేణి సంస్థ ఎంతో మందికి ఉపాధి కాల్పించింది. అలాంటి సింగరేణిని ఎందుకు వేళం వేశారో చెప్పాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్ తన క్యాంపు కార్యాలయంలో ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సింగరేణిని ప్రైవేట్ పరం చేసేందుకు చర్యలు చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర భాగస్వామ్యంతో సింగరేణి నడుస్తున్నప్పటికి కేసీఆర్ అధికారంలోకి వచ్చాక పలు సంస్కరణలు చేపట్టి లాభాల్లోకి తీసుకొచ్చారన్నారు. ఒడిషా, తమిళనాడు, గుజరాత్లో ఉన్న బొగ్గు గనులను ఆయా రాష్ట్రాలక కేటాయించారు. లాభాల్లో ఉన్న సింగరేణిని



ఎందుకు ప్రైవేట్ పరం చేస్తున్నారని ప్రశ్నించారు. నాడు కేసీఆర్ సింగరేణిని తెలంగాణకు ఇవ్వాలని కోరిన ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలన్నారు. అంతేకాదు నాడు పీసీసీ చీఫ్ ఉన్న రేవంత్ రెడ్డి బొగ్గు గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ లేఖ రాసిన విషయాన్ని గుర్తు చేశారు. నేడు అదే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు బీజేపీతో చేతులు కలిపి బొగ్గు గనుల వేలంలో పాల్గొనడం వారి ద్వంద వైఖరికి నిదర్శనమని విమర్శించారు. సింగరేణికిలో ప్రైవేట్ సంస్థలు వస్తే రిజర్వేషన్లు పోతాయి. పేదలు, దళితులు హక్కులు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి కిషన్ రెడ్డికి గనుల శాఖ మంత్రి పదవి రావడంతో సింగరేణిని కాపాడుతారని తెలంగాణ ప్రజలు భావించారు. అందుకు భిన్నంగా మంత్రి ప్రవర్తించడం విచార కరమన్నారు. సింగరేణికి కాపాడుకునేందుకు పార్టీలకు అతీతంగా ఉద్యమించాలన్నారు.

# మిర్చి వ్యాపారి టోకరా.. రైతులకు ఇవ్వాలని 2 కోట్లతో పరార్

మిర్చి రైతులకు ఓ వ్యాపారి టోకరా ఇచ్చాడు. రైతుల నుంచి వెయ్యి క్వింటాళ్ల మిర్చిని కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా పరారయ్యాడు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల పరిధిలోని మలుగుమాడులో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మలుగుమాడు గ్రామానికి చెందిన కృష్ణారావు మిర్చి వ్యాపారి. కొద్ది రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన రైతుల నుంచి దాదాపు వెయ్యి క్వింటాళ్ల మిర్చిని కొనుగోలు చేశాడు. 15 రోజుల్లోనే డబ్బులు చెల్లిస్తానని మిర్చి కొనేటప్పుడు రైతులకు మాటిచ్చాడు. కానీ వ్యాపారి చుట్టూ ఎంత తిరిగినా డబ్బులు ఇవ్వలేదు. ఈ క్రమంలోనే కృష్ణారావు గ్రామం విడిచి వెళ్లిపోయాడు. అతని గురించి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. ఈ క్రమంలోనే 15 రోజుల కిందటి నుంచి వారు కూడా కనిపించడం లేదు. దీంతో ఆగ్రహానికి గురైన రైతులు.. ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ నుంచి కొనుగోలు చేసిన మిర్చి పంట విలువ రూ.2 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు.



## సీఎం అంటే కటింగ్ మాస్టరా..? కొత్త నిర్వచనమా..?

-మొదటిపేజీ తరువాయి

శఠగోపం పెట్టే కుటిల ప్రయత్నం చేస్తే సహించమన్నారు. రేషన్ కార్డు సాకు చూపి.. లక్షల మందికి మొండిచెయ్యిచ్చే కుతంత్రం చేస్తే భరించమన్నారు. ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారని కొంతమందికి.. చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారని ఇంకొంతమందికి.. శూన్యహస్తం చూపే చీకటి పన్నాగాన్ని చూస్తూ ఊరుకునేది లేదన్నారు. మొన్న లక్షలాది మందిని రూ.500 సిలిండర్ పథకానికి దూరం చేశారని.. నిన్న 200 యూనిట్ల పథకానికి ఆంక్షలు పెట్టి ఆగమాగం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు రూ.2లక్షల రుణమాఫీని కూడా ఎగొట్టేందుకు లక్షలాది మంది రైతులకు ఎగనామం పెడతామంటే కుదరదన్నారు. నాట్ల నాడు ఇవ్వాల్సిన రైతుబంధుకు ఇప్పటికీ దిక్కులేదని.. ఓట్ల పండగ ముగిసినా.. ఎకరానికి రూ.7500ల రైతుభరోసాకు అడ్రస్సే లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రచారంలో 'అందరికీ అన్నీ' అన్నారని.. అధికారంలోకి రాగానే 'కొందరికే కొన్ని' అంటూ కోతపెడుతున్నారని ఎద్దేవా చేశారు. రుణమాఫీపై మాట తప్పినా.. మడమ తిప్పినా.. లక్షలాది రైతు కుటుంబాల తరపున ప్రశ్నిస్తాం.. పోరాటం చేస్తామంటూ ఆయన ఎక్స్(ట్విట్టర్) వేదికగా స్పందించారు.


## పార్టీలో మార్పుచేర్పులు!

-మొదటిపేజీ తరువాయి

రేవంత్ త్వరలోనే మంత్రివర్గం విస్తరించనున్నట్లు సమాచారం. దీనిపై ఏఐసీసీ ముఖ్య నాయకులు సోనియా గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ లాంటి వారితో చర్చించినట్లు తెలిసింది. ప్రస్తుతం ముఖ్యమంత్రి కాకుండా మరో 11 మంది మంత్రివర్గంలో ఉన్నారు. సీనియర్ నాయకులు, ముఖ్యులు, శాసనసభ ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన వారికిచ్చిన హామీలను పరిగణలోకి తీసుకోవడంతో కొన్ని జిల్లాలకు ఎక్కువ ప్రాతినిథ్యం దక్కగా, కొన్ని జిల్లాలకు అసలు చోటు లభించలేదు.

మొత్తంగా మరో ఆరుగురిని కొత్తగా మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉండగా.. ప్రస్తుతం నలుగురికి అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. మరికొందరు చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సీనియర్ నేతలు ఎవరైనా వస్తే వారికి మంత్రి పదవి లభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జూన్ నెలాఖరుకు లేదంటే జులై మొదటి వారంలో విస్తరణ ఉండొచ్చని సమాచారం.

## డెంగ్యూపై రాష్ట్రాన్ని హెచ్చరించిన డబ్ల్యూహెచ్‌వో..




రాష్ట్రంలో డెంగ్యూ కేసులు పెరుగుతోన్నాయి. దీనికి ప్రధాన కారణం డెంగ్యూ దోమలు. అంతకు ముందు చెత్త కుప్పల్లో, మురికి కాలువల్లో వృద్ధి చెందే ఈ దోమలు ఇంట్లో కూడా పెరుగుతోన్నాయి. వర్షకాలం వర్షపు నీరు నిలిచిపోయి డెంగ్యూ దోమలు పెరుగుతోన్నాయి. ముఖ్యంగా ఇళ్లలో వీటి వృద్ధి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అందుకే ఎండకాలం కూలర్ వాడిన తర్వాత అందులో వాటర్ తీసివేయాలి. లేకుంటే అందులో దోమలు వృద్ధి చెందుతాయి. అలాగే కొబ్బరి బొండాలను ఇంటి బయట పడేస్తారు. అందులో నీరు చేరి దోమలు తయారవుతాయి. అలాగే ఇంటిపై టైర్లు, డబ్బలు పడేస్తుంటారు. వాటిలో కూడా నీరు చేరి దోమలు వృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది. చాలా నిర్లక్ష్యంగా ఉండడంతో డెంగ్యూ దోమలు వృద్ధి చెంది డెంగ్యూ జ్వరాలు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వల్ల కూడా కేసులు పెరుగుతున్నాయని ఆరోగ్య శాఖ అంచనా వేస్తోంది. ఆస్పత్రులు డెంగ్యూ కేసులపై రిపోర్ట్ ను ఆలస్యం?చేస్తుండడం వల్ల కేసుల సంఖ్యపై ఒక్కోసారి గందరగోళం ఏర్పడుతుందని డబ్ల్యూహెచ్?వో విశ్లేషించింది.

## హైదరాబాద్ -విజయవాడ హైవేపై 17 బ్లాక్ స్పాట్ల గుర్తించాం



-మొదటిపేజీ తరువాయి

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. ఆగస్టు 15లోగా 2 లక్షల రూపాయల రుణమాఫీని పూర్తి చేస్తామని పేర్కొన్నారు. వారం రోజుల్లో పేదలకు ఇంది రమ్మ ఇండ్లు నిర్మించే కార్యక్రమం చేపడతామని చెప్పారు. సొంత స్థలం ఉంటే తక్షణమే ఇల్లు ఇస్తాం. లేని వారికి ప్రభుత్వ స్థలం ఉన్నచోట ఇళ్లు కట్టించి ఇస్తామ తెలిపారు. రూ.30 వేల కోట్లతో హైదరాబాద్ రీజ నల్ రింగ్ రోడ్డు పనులు చేపట్టనున్నామని, హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారితో పాటు, ఇతర ఆర్ అండ్ బి రోడ్లకు రూ.16000 కోట్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు. అలాగే చిట్యాల లో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేస్తామన్నారు.

## సూర్యాపేట జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం

**సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దురాజ్‌పల్లిలోని జయశంకర్ పాలిమర్స్ పేపర్, ప్లాస్టిక్ గ్లాసుల తయారీ గోదాంలో షార్ట్ సర్క్యూట్‌తో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. వెంటనే సిబ్బంది ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేశారు. వెంటనే సంఘటన స్థలనానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్లతో మంటలను ఆర్పుతున్నారు. ఈ ప్రమాదంలో మిషనరీతో పాటు ముడిసరుకు పూర్తిగా దగ్ధమైంది. సుమారు కోటి రూపాయల వరకు ఆస్థి నష్టం జరిగినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# ఒకే విడతలో రైతు రుణమాఫీ చారిత్రాత్మకం

**రైతుల కళ్ళల్లో ఆనందం చూడాలన్నదే సీఎం తపన**
**కాంగ్రెస్ నాయకులు నీలం మధు**



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** మాటిస్తే కాంగ్రెస్ పార్టీ నెరవేర్చుతుందని, ఒకే విడతలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చారిత్రాత్మక నిర్ణయమని ముఖ్యఅతిథిగా హాజరైన మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఒకే విడతలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తూ రాష్ట్ర క్యాబినెట్, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సంబరాలు నిర్వహించి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజ నరసింహ చిత్రపటాలకు రైతులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీని ప్రభుత్వం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాతి అని అనాదిగా రైతుల శ్రేయస్సు కోసం సంక్షేమం కోసం పాటుపడ్డ చరిత్ర కాంగ్రెస్ పార్టీది అన్నారు. తెలంగాణలో ముఖ్యమైన జల ప్రాజెక్టులన్ని కాంగ్రెస్ హాయంలోనే నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి పంటకు నీరందించాలని, ప్రతి చేనును తడపాలని రైతులను ఆర్థికంగా స్థితిమంతులను చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తూ నూతన ప్రాజెక్టులకు సైతం శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. వ్యవసాయానికి పునర్వైభవం తీసుకువచ్చి రైతుల కళ్ళలో ఆనందం చూడాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తపన అన్నారు. అందులో భాగంగా 2 లక్షల రూపాయల రుణమాఫీని ఒకే దఫాలో చేయడంతో రైతులంతా ఆనందంతో సంబరాలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ తో పాటు రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడంతో మెరుగైన మార్కెటింగ్ వ్యవస్థను కల్పించడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని తెలిపారు. రైతులకు అండగా నిలబడుతూ ఒకే దఫాలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మంత్రులు దామోదర రాజనర్సింహ కొండా సురేఖ, రాష్ట్ర క్యాబినెట్ కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఒక రైతు బిడ్డగా తాను సైతం రైతన్నల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్ గౌడ్, పిసిసి కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి,ఎంపీ మాణిక్యరావు, ప్రతాప్ రెడ్డి,నారాబోయిన శ్రీనివాస్,సుంకరబోయిన మహేష్, మాజీ ఎంపీటీసీ పుట్టి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆర్టిస్టులను ప్రభుత్వం గుర్తించాలి - రాష్ట్ర అధ్యక్షులు తాళ్లపల్లి రాజేశ్వర్






**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** తెలంగాణ ఆర్టిస్టుల సంక్షేమ సమితి జిల్లా స్థాయి సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్ లో నిర్వహించారు. సమావేశానికి తెలంగాణ ఆర్టిస్టుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు తాళ్లపల్లి రాజేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. తెలంగాణలోని చిత్రకారులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆర్టిస్టులోసమస్యలు పరిష్కరించాలన్నారు. తెలంగాణలోని ఆర్టిస్టులను ప్రభుత్వము గుర్తించి ఆర్టిస్టు సంక్షేమం కొరకు తక్షణమే కార్పొరేషన్ ఏర్పాటు చేసి సంక్షేమానికి పాటుపడాలని డిమాండ్ చేశారు. ఆర్టిస్టుల కుటుంబాలను గుర్తించి వారికి ఉచితంగా విద్య వైద్యము అందించాలని, ప్రమాదము భీమా సౌకర్యం కలిపించన్నారు. నిరుపేదలైన ఆర్టిస్టుల కుటుంబాలకు ఇల్లు, ఇళ్ల స్థలాలు లేని వారిని గుర్తించి వెంటనే ఇండ్లు మంజూరు చేసి ఆదుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు తాళ్లపల్లి రాజేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గందేవర్ రామకృష్ణ, ముఖ్య సలహాదారులు కంకణాల సత్యనారాయణ, సభ అధ్యక్షులు సత్యం, పెద్దపల్లి మాజీ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, సత్య కళ ఆర్ట్స్ గజ్వేల్ సిద్దిపేట జిల్లా రాజనాథ్, రాష్ట్ర నాయకులు జగిత్యాల జిల్లా విశ్వతేజ, రాష్ట్ర నాయకులు బాలకృష్ణ, నిర్మల్ జిల్లా అధ్యక్షులు సిద్దిపేట జిల్లా యాదవరావు రాష్ట్ర నాయకులు యాదగిరి, మంచిర్యాల జిల్లా రాష్ట్ర నాయకులు తేజ ఆర్ట్స్ ప్రకాష్ ఆర్ట్స్ నరహరి శ్రీ ఆర్ట్స్ చిత్రకారులు ఆర్టిస్టులు పలువురు పాల్గొన్నారు.

# ఎస్పీ గౌష్ ఆలమంటే.. అక్రమ గుట్కా వ్యాపారుల గుండెల్లో దడ

**అక్రమ గుట్కా నిల్వ స్థావరాలపై పోలీసుల వరుస దాడులు**

**రూ.77,60,586 లక్షల విలువ చేసే నిషేధిత గుట్కా స్వాధీనం**

**ఎస్పీ గౌష్ ఆలం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అర్ధరాత్రి స్పెషల్ డ్రైవ్**

**నిషేధిత గుట్కా నిల్వ ఉంచిన ఐదు గోడౌన్లు సీజ్**





**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** ఎస్పీ గౌష్ ఆలం పేరు వినగానే అక్రమ గుట్కా వ్యాపార గుండెల్లో దడ పుడుతోంది. ఆదివాసి జిల్లా ఆయన ఆదిలాబాద్ జిల్లాలో నిషేధిత గుట్కా వ్యాపారాన్ని అంతం అందించడం కోసం కృషి చేస్తున్నారు. నిషేధిత గుట్కా నిల్వచేసిన గోడౌన్లపై పోలీసులు వరుస దాడులు చేస్తున్నారు. ఎస్పీ గౌస్ ఆలం ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలోని ఐదు గోడౌన్లపై తనిఖీలు చేపట్టారు. స్థానిక ఓంకార్ జిన్నింగ్ మిల్ నందు నాలుగు గోడౌన్స్ లలో, చాందా వద్దగల ఒక గోడౌన్ల పై పోలీసులు దాడులు నిర్వహించి రూ.77,60,586 లక్షల విలువ చేసే నిషేధిత గుట్కాను సీజ్ చేశారు. దాడుల్లో భాగంగా ఆదిలాబాద్ వన్ టౌన్ లోని ఓంకార్ జిన్నింగ్ నందు గల నాలుగు గోడౌన్స్ లో రూ 50,16,942/- విలువచేసి దాదాపు 20 రకాల నిషేధిత గుట్కాను పట్టుకొని నలుగురిపై కేసు నమోదు చేశారు. ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ నందు రూ.27,43,644/- విలువ చేసి నిషేధిత గుట్కా లభించిందని నలుగురిపై కేసులు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న నిషేధిత గుట్కా విలువ రూ 77,60,586/- లక్షల ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితుల్లో సాజిదుల్లా ఖాన్, ఫసివుల్లా ఖాన్ లను అరెస్టు చేయగా అస్లాం ఖాన్, సమీ ఉల్లా ఖాన్, అర్బాజ్ అలీ లు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గుట్కా వినియోగం వల్ల ప్రజలకు తీవ్ర అనారోగ్యం, దీర్ఘకాలిక రోగాల బారిన పడటం, ప్రమాదకరంగా ఉండటం వల్ల రాష్ట్ర ప్రభుత్వం వీటిని నిషేధించడం జరిగిందని తెలిపారు. లభించిన నిషేధిత గుట్కా రకాలు అనర్, ఎస్ ఆర్ వన్, ఎక్సెల్ వన్, షార్ట్ 999, ఆర్ 50, జెడ్ ఎల్, సితార గుట్కా, మాణిక్చంద్, హెచ్ ఫైవ్, స్వాగత్ లాంటి పేర్లతో ఉండటం జరిగిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నిషేధిత గుట్కాను అమ్మినా, రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గుట్కాను సమూలంగా జిల్లా వ్యాప్తంగా రూపుమాపాలనే ఉద్దేశంతో ప్రత్యేక సిబ్బందిని నియమిస్తూ నిఘా వ్యవస్థను పటిష్టం చేస్తూ విధులను నిర్వర్తించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గుట్కా విక్రయదారులు నిషేధిత గుట్కాను విక్రయించడం మానుకోవాలని సూచించారు.

## మొక్కలు నాటుదాం..
## భావి తరాలకు పచ్చదనం బహుమతిగా అందిద్దాం



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని పటాన్ చెరు మాజీ జడ్పీటీసీ, లయన్స్ క్లబ్ ఎంజెఎఫ్ మాదిరి జైపాల్ ముదిరాజ్ అన్నారు. ఎండీఆర్ ఫౌండేషన్ కో- ఫౌండర్ మాదిరి ప్రిథ్వీరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం పటాన్ చెరు పట్టణంలోని అంబేద్కర్ కాలనీ, న్యూ మార్కెట్ రోడ్డులో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, భావి తరాలకు పచ్చదనాన్ని బహుమతిగా అందించాలని వారు పిలుపునిచ్చారు. అడవుల నరికివేత, రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యం వల్ల భూతాపం పెరిగిపోతోందన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భూమి మీద జీవరాశి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని వివరించారు. అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎండిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాదిరి దేవేందర్ రాజు, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, సపనదేవ్, ప్రతాప్, ప్రకాష్ రావు, సాయి తేజ, వెంకటేశ్వర్లు, మతీన్, నరేష్, రాజన్ సింగ్, ఎండిఆర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ మధు మరియు ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గాయపడ్డ యువకుడికి
## వివిఆర్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం




**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** బొల్లారం మున్సిపల్ పరిధిలోని గాంధీ నగర్ లో నివసించే సయ్యద్ అమీర్ ప్రమాదవశాత్తు ఇటీవల బిల్డింగ్ పై నుండి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్ర గాయాలతో అమీర్ సూరారం లోని మల్లారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్ రెడ్డి వివిఆర్ ఫౌండేషన్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం పది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి మానవతను చాటుకున్నారు. బాధితుడిని ఆదుకోవాలని ప్రవీణ్ రెడ్డి దాతలను సోషల్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు. ప్రవీణ్ రెడ్డి పిలుపుకు స్పందించి మున్సిపల్ యువకులు నాని, ముజ్జు మరియు వారి యువజన సంఘం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బాధితుడికి పదిహేను వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన యువకులను ప్రవీణ్ రెడ్డి అభినందించారు. యువకుడి పరిస్థితి చాలా సీరియస్ గా ఉందని దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యువకులు అహ్మద్ జలీల్, షాన్వాస్, దిగంబర్, అజ్జు, చిన్ను తదితరులు పాల్గొన్నారు.

## డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** శ్యాం ప్రకాష్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా సంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజి రెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి ఆదెల్లి రవీందర్ అధ్యక్షతన శ్రీ శ్యాంప్రకాష్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కోల్కూర్ రాజశేఖర్ రెడ్డి మాణిక్ రావు అధికార ప్రతినిధి రాజు గౌడ్ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి జిల్లా కార్యదర్శి మందుల నాగరాజు జిల్లా కార్యదర్శి రజిని శరత్ సంగారెడ్డి జిల్లా యువమోర్చా అధ్యక్షులు ప్రవీణ్ యాదవ్ సంగారెడ్డి నియోజకవర్గ విష్ణువర్ధన్ రెడ్డి సదాశివపేట్ మండల్ అధ్యక్షులు శ్రీనివాస్ కంది మండల అధ్యక్షులు సుదర్శన్ చారి సంగారెడ్డి పట్టణ అధ్యక్షులు ద్వారక రవి వివిధ మండలాధ్యక్షులు రాష్ట్ర జిల్లా నాయకులు బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నరేష్ జాధవ్ జన్మదిన వేడుకలు



**వాస్తవ నేస్తం,గుడిహత్నూర్:** మండల కేంద్రంలో ఏఐసీసీ మెంబర్, ఆదిలాబాద్ పార్లమెంట్ కో ఇంచార్జి డా.నరేష్ జాధవ్ జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాల్యాల కరుణాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల జనరల్ సెక్రెటరీ పవార్ రాజు, జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు జాధవ్ వసంత్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు సంజీవ్, మాజీ ఏఎంసి డైరెక్టర్ ఆడే సునీల్ నాయక్, మండల నరేష్ దుబ్బాక, మండల కార్యదర్శి శత్రుగన్, మండల నాయకులు రాథోడ్ రమేష్, ఇసుబ్, సాహెబ్ రావు, విష్ణు, మాధవ్, తదితరులు పాల్గొన్నారు.


Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com